క్లుప్తంగా

సుదర్శన యాగం ప్రారంభం



సుదర్శన యాగం ప్రారంభ పూజల్లో భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక పీఎస్‌కాలనీ వర సిద్ధి వినాయక పంచాయతన దేవాలయంలోని అష్టలక్ష్మి ఆలయ ప్రాంగణంలో నారసింహ సహిత మహా సుదర్శన యాగం చామర్తి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త పి.జగన్మోహనరావు మాట్లాడుతూ.. విశ్వశాంతి సంరక్షణ కోసం, అందరికీ సుఖ శాంతులు వర్ధిల్లాలనే సంకల్పంతో యాగాన్ని మూడు రోజులు పాటు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ముందుగా విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, పరిషత్ విజ్ఞాపనం, రుత్విక వరుణం, రక్షా కంకణ ధారణ, అఖండ దీప మండపా వాహనలు, అగ్ని ప్రతిష్ట జరిగింది. సాయంత్రం సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ, సుదర్శన స్తోత్రములు పారాయణ చేపట్టారు. కార్యక్రమంలో ఆడిటర్ కనుగుల శ్రీనివాసరావు, పి.శ్రీకాంత్, నిక్కు అప్పన్న, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్ సీఐగా పైడపునాయుడు



ఎస్పీ మహేశ్వరరెడ్డికి పూలమొక్కను అందజేస్తున్న సీఐ పైడపునాయుడు

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం రూరల్ సీఐగా సీహెచ్ పైడపునాయుడు శుక్రవారం ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ సర్కిల్ కార్యాలయ చాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన లెంక సన్యాసినాయుడు ఇటీవల బదిలీ అయిన సంగతి తెలిసిందే. పైడపునాయుడు ఎస్ఐ అయిన తొలినాళ్లలో ఇదే స్టేషన్‌లో శిక్షణ పొంది పాతపట్నం ఎస్ఐగా 2000లో విధుల్లో చేరారు. అనంతరం జిల్లాలోని హిరమండలం, నరసన్నపేటలో కూడా పని చేసి విశాఖ సిటీ వెళ్లారు. సీఐగా మళ్లీ జిల్లాలోనే విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో 2011లో ఉద్యోగోన్నతి పొంది విశాఖసిటీ, ఇచ్ఛాపురం సర్కిల్, విశాఖ సిటీ, సీఐడీలో చేసి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈయన సొంత గ్రామం విజయనగరం జిల్లా బొబ్బిలి సమీప పింద్రంగివలస. విధుల్లో చేరిన అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.

రజక ఫెడరేషన్ పదవి కేటాయించాలి



మాట్లాడుతూ రజక సంఘ నాయకులు

రణస్థలం: రజకుల సంక్షేమం కోసం విశేషంగా పాటుపడిన గురజాపు రాముకు టీడీపీ రాష్ట్ర రజక ఫెడరేషన్ చైర్మన్ పదవి కేటాయించాలని రజక సాధికారిక నాయకులు సోపేటి రామారావు, గన్నారెడ్డి సింహాచలం, జొన్నాడ భాస్కర్, శ్రీల సురేష్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు మాట్లాడుతూ టీడీపీ అభివృద్ధికి రజక సంఘాలతో కలిసి గత 25 ఏళ్లుగా పనిచేస్తున్నారని, విజయనగరం పార్లమెంటరీ టీడీపీ కన్వీనర్‌గా, జయహో బీసీ స్టార్ క్యాంపైనర్‌గా పనిచేసిన అనుభవం ఉందన్నారు.

అసిరతల్లి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

శ్రీకాకుళం కల్చరల్: తమ్మినాయుడుపేటలో వేంచేసిన లలితా చంద్రమౌళీశ్వర దేవాలయం ఆధ్వర్యంలో అసిరితల్లి అమ్మవారి ఆలయ నిర్మాణం కోసం శంకుస్థాపన కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఆలయ ధర్మకర్త సాగి శ్రీనివాసరాజు వర్మ దంపతులు ఆధ్వర్యంలో ప్రధానార్చకులు శ్రీపాద సురేష్ శర్మ వేదమంత్రాల నడుమ శంకుస్థాపన చేపట్టారు.

సేవా కార్యక్రమాలు చేపట్టాలి

శ్రీకాకుళం అర్బన్: సినీనటుల అభిమాన సంఘాలు సేవా కార్యక్రమాలు చేస్తూ ఆదర్శంగా నిలవాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. సినీనటుడు మహేష్‌బాబు పుట్టినరోజును పురస్కరించుకొని నగరంలోని కిన్నెర థియేటర్‌లో అభిమానులు రక్తదాన శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో తెలుగుయువత జిల్లా అధ్యక్షులు మెండ దాసునాయుడు, దుంగ భాస్కర్, బస్వా నాని, శ్రీకాకుళం జిల్లా మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బస్వా రాజేష్‌రెడ్డి పాల్గొన్నారు.

సమగ్రపాలన కాంగ్రెస్‌తోనే సాధ్యం

శ్రీకాకుళం అర్బన్: దేశంలో సామ్యవాద విధానం, సమగ్ర పరిపాలన, పేదరిక నిర్మూలన, కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి అన్నారు. క్విట్ ఇండియా దినోత్సవ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పతాకాన్ని శుక్రవారం శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞాన్‌భవన్‌లో డీసీసీ అధ్యక్షులు పేడాడ పరమేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృపారాణి మాట్లాడారు. రాహుల్‌గాంధీ ప్రధాని అయ్యేవరకు మనమంతా శ్రమించాలన్నారు. నాయకులు డి.గోవింద మల్లిబాబు, సనపల అన్నాజీరావు, మంత్రి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



జి.సిగడాం: వైఎస్సార్‌సీపీ హయాంలో ఇంటి వద్దకే రేషన్ అందించేందుకు చర్యలు తీసుకుంటున్న వలంటీర్లు(ఫైల్)

రేషన్ సరుకులకు ఇక కష్టాలేనా?



గార :ఎండీయూ వాహనం ద్వారా ఇంటి వద్దనే ఇస్తున్న సరుకులు పంపిణీ (ఫైల్)

- ఇంటింటికీ రేషన్ సరుకుల పంపిణీ రద్దు
- పాత పద్ధతిలో రేషన్ సరుకుల పంపిణీ
- పాత రోజులు వస్తాయని ప్రజల ఆందోళన

గార :ఇంటి వద్దకే నాణ్యమైన సరుకులు అందించే ఇంటింటికీ రేషన్ పథకానికి కూటమి ప్రభుత్వం రద్దు చేసేందుకు నిర్ణయించింది. మండలంలో 25 పంచాయతీల్లో 50 రేషన్ దుకాణాలున్నాయి. ఆయా డిపోల పరిధిలో 16 ఎండీయూ వాహనాలను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రతీ నెలా ఒకటో తేదీ నుంచి 5వ తేదీలోగా వలంటీర్ల ద్వారా ఇంటివద్దకే సరుకులను పంపిణీ చేసింది. సరుకులు ఇకపై డిపోల వద్దనే తీసుకోనేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం చేస్తుండటంతో లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. మేజర్ పంచాయతీలు శ్రీకూర్మం, అంపోలు వంటి ప్రాంతాల్లో లబ్ధిదారులకు ఇబ్బందులు ఎక్కువకానున్నాయి. ఎస్సీ గ్రామాలైన గోరువానిపేట, చింతువలసలతో పాటు తీర ప్రాంతంలోని పరపతివానిపేట గ్రామస్తులు మూడు కిలోమీటర్లు పైబడి ఉన్న ఎస్.మత్స్యలేశం వెళ్లి తీసుకోవాల్సిన పరిస్థితి ఉంది. తోనంగి పంచాయతీ బచ్చుపేట, వమరవల్లి పంచాయతీలో సుగ్గుదాలినాయుడుపేట గ్రామాల లబ్ధిదారులకు అవస్థలు ఎక్కువకానున్నాయి.

ఇంటి వద్దే రేషన్ అందించాలి



రేషన్‌ను ఇంటివద్దే తీసుకోవడం బాగుంది. ఈ విధానాన్ని రద్దు చేస్తే తమలాంటి వాళ్లకు చాలా కష్టం. గతంలో కిలో మీటరు దూరం నడిచివెళ్లి రేషన్ తీసుకునేవాళ్లం. ఇప్పటి వరకూ మాకు ఇంటివద్దనే రేషన్‌కు అందించారు. ఎండీయూ వాహనాలను కొనసాగించాలి.

–ఎం.లక్ష్మి, రాగోలు, శ్రీకాకుళం మండలం

కష్టాలు పెరుగుతాయి



డిపోల వద్దకు వెళ్లి సరుకులు తీసుకోవడం చాలా కష్టంగా మారుతుంది. మా గ్రామం నుంచి శ్రీకూర్మంలోని వెలమవీధి వెళ్లి సరుకులు తీసుకోవాల్సి వస్తుంది. డిపోల వద్ద క్యూలైన్లో ఉండి ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఎస్సీ, బీసీ గ్రామాల ప్రజలకు అందుతున్న సేవలను కొనసాగనివ్వాలి.

–కొలకోట రజిని, చింతువలస, గార మండలం

క్యూ కష్టాలు తొలగాయి



బియ్యం వంటి నిత్యావసర సరుకుల కోసం డిపోల దగ్గర క్యూలైన్ కష్టాలు లేవు. గంటలు కొలది ఉండాల్సిన పరిస్థితి ఉండేది. సరుకుల నాణ్యతతో పాటు ఏమాత్రం తరుగు లేకుండా ఇంటి వద్దకే తెచ్చి ఇస్తున్నారు.

– సీహెచ్. సునీతారెడ్డి, కళింగపట్నం, గార మండలం

జగనన్న కాలనీ సందర్శన



కాలనీని పరిశీలిస్తున్న జేసీ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని రాగోలు అర్బన్ లేఅవుట్ జగనన్న కాలనీని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్ శుక్రవారం సందర్శించారు. ఇంకా పూర్తికాని ఇల్లు ఉంటే వెంటనే వాటిని పూర్తి చేసే దిశగా ప్రణాళిక సిద్ధం చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. స్థలం మంజూరై కనీసం పనులు ప్రారంభించలేని వాటికి తక్షణమే నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని సూచించారు, నిర్మాణపు పనులు పూర్తి కావాలంటే ఇసుక కొరత ఉందని స్థానికంగా గల కాంట్రాక్టర్లు జేసీకి వివరించారు. కాలనీలో శానిటేషన్ ఏమి బాగోలేదన్నారు. మున్సిపల్ శాఖాధికారులు గైర్హాజర్ కావడంతో వారిపై జేసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం 1740 ఇళ్లు రాగోలు అర్బన్ లేఅవుట్‌లో నిర్మితమవుతున్నాయని, ఇందులో 300కు పైగా పూర్తయినట్లు హౌసింగ్ అధికారులు వెల్లడించారు. ఈసందర్భంగా స్థానికంగా నివాసం ఉంటున్న వారంతా స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలను జేసీకి వివరించారు. వీధిలైట్లు వెలగడం లేవని, డ్రైనేజీలు, రోడ్లు, కాలువలు నిర్మించలేదన్నారు. జేసీ మాట్లాడుతూ.. హౌసింగ్, మున్సిపల్, ఎలక్ట్రికల్, రెవెన్యూ అధికారులంతా కాలనీ వాసులతో సమావేశమై వారి సమస్యలు పరిష్కరించే దిశగా ఒక నివేదిక వెంటనే తనకు అందించాలన్నారు. హౌసింగ్ పీడీ నగేష్, తహసీల్దార్ గణపతిరావు, ఇన్‌చారిజ ఎంపీడీవో, సర్వేయర్ రఘు ఉన్నారు.

ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి



డీఈవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యాశాఖ జారీచేసిన పని సర్దుబాటు విషయంలో ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, విద్యాశాఖలో ఉన్న వివిధ సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ జిల్లాశాఖ అధ్యక్షుడు ఎస్.వి.రమణమూర్తి, కార్యదర్శి పడాల తమ్మినాయుడు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారిగా తాజాగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ఎస్.తిరుమలచైతన్యను ఎస్టీయూ శ్రీకాకుళం జిల్లా శాఖ తరపున మర్యాపూర్వకంగా శుక్రవారం కలిసి సత్కరించారు. అనంతరం వినతి పత్రాన్ని అందజేశారు. 70%పైన అంగవైకల్యం కలిగిన ఉపాధ్యాయులకు పని సర్దుబాటు నుంచి మినహాయింపును ఇవ్వాలని, 100 మంది రోలు దాటిన ప్రాథమిక ఉన్నత పాఠశాలకు మిగులు పీఈటీలను సర్దుబాటులో ఇవ్వాలని, ఎయిడెడ్, అంతర్ జిల్లాల నుంచి బదిలీగా వచ్చిన ఉపాధ్యాయులను పని సర్దుబాటు ప్రక్రియలో జూనియర్‌గా గుర్తించాలని విన్నవించారు. డీఈవోను కలిసిన వారిలో ఎస్టీయూ జిల్లా గౌరవ అధ్యక్షులు సన్యాసిరావు, టౌన్ సెక్రటరీ బొడ్డేపల్లి శ్రీధర్, శ్రీకాకుళం రూరల్ మండలం జనరల్ సెక్రటరీ చింతల రామారావు, కూన శ్రీనివాసరావు, జి.శ్రీనివాసరావు, తేజేశ్వరరావు ఉన్నారు.

మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో సత్తాచాటాలి



ఎంపికైన విద్యార్థులతో పాఠశాల ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో క్రమశిక్షణ, సమయస్ఫూర్తి, టెక్నిక్‌తో సత్తా చాటి రాణించాలని ఢిల్లీ ఇంటర్నేషనల్ స్కూల్ అకాడమిక్ డైరెక్టర్ ముద్దాడ సత్యప్రసాద్ పిలుపునిచ్చారు. ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరగనున్న అంతర్జాతీయస్థాయి మార్షల్ ఆర్ట్స్ (వెపన్) నుంచా విభాగంలో పోటీలు జరగనున్నాయి. పోటీల్లో పాల్గొనే పాఠశాల విద్యార్థులు శుక్రవారం ఇక్కడ నుంచి పయనమై వెళ్లారు. వీరికి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ పోటీలకు బి.కార్తికే, ఆర్‌పి గౌరవ్, షణ్ముఖ్, మోహిత్, అరవ అభిరామ్, సందీప్, జైచరణ్, పి.వంశీకృష్ణ ఎంపికయ్యారు. సత్యప్రసాద్ తోపాటు ప్రిన్సిపాల్ తరిని అర్జున్‌చక్రవర్తి, కోచ్ నక్క లక్ష్మణ్‌నాయుడు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

విజయబావుటా ఎగురవేయండి



ఎంపికైన విద్యార్థులతో పాఠశాల ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఈ సీజన్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి మొట్టమొదటి సాఫ్ట్‌బాల్ మీట్ పోటీల్లో విజయబావుటా ఎగురవేయాలని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ కలిదిండి వెంకటరామరాజు అన్నారు. ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు గుంటూరు జిల్లా వినుకొండ వేదికగా ఏపీ రాష్ట్రస్థాయి సీనియర్స్ (పురుషులు, మహిళల) సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్–2024 పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల బృందం శుక్రవారం ఇక్కడ నుంచి పయనమై వెళ్లింది. వీరికి శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వద్ద సంఘ ప్రతినిధులు, కోచ్‌లు, పీడీలు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు, సాఫ్ట్‌బాల్ సంఘ ప్రతినిధులు ఎంవీ రమణ, మెట్ట తిరుపతిరావు పాల్గొన్నారు.

రక్తదానం చేయండి

శ్రీకాకుళం అర్బన్: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధులు జి.ఇందిరాప్రసాద్, ఎస్.జోగినాయుడు, బి.దేవీప్రసాద్‌లు పిలుపునిచ్చారు. శుక్రవారం శ్రీకాకుళంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్, ధర్మశాస్త సన్నిధానం ట్రస్ట్ ఆధ్వర్యంలో గోడపత్రికను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 11వ తేదీన శ్రీకాకుళం నగరంలోని పాతబస్టాండ్ వద్ద శ్రీధర్మ శాస్త సన్నిధానం ట్రస్ట్ అధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. నగరంలో ఉన్న నడక సంఘాల సభ్యులు అంతా విధిగా పాల్గొని రక్తాన్ని దానం చేయాలని కోరారు. స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు, శ్రీధర్మ శాస్త సన్నిధానం ట్రస్ట్ ప్రతినిధులు బరాటం సంతోష్, పి.నాగేశ్వరరావు, అంధవరపు సంతోష్, పట్నాల శేఖర్ పాల్గొన్నారు.

బాలికా విద్యతోనే నవసమాజ స్థాపన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం రూరల్: నవ సమాజ స్థాపన బాలికా విద్యతోనే సాధ్యపడుతోందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. సింగుపురంలోని కేజీబీవీ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ఒన్‌స్టాప్ సెంటర్ల అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆడ పిల్లలను బాగా చదివించాలన్నారు. ఆపదలో ఉన్న మహిళలకు అపన్నహస్తం, బాలికలకు భరోసాగా ఒన్‌స్టాప్ సెంటర్లు పనిచేస్తాయన్నారు. జిల్లా న్యాయశాఖ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు కేజీబీవీని క్షుణ్ణంగా పరిశీలించారు. వసతులపై పిల్లలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సోషల్ కౌన్సిలర్ రేణుఖ, ప్రిన్సిపాల్ జె.లలిత, స్థానిక సర్పంచ్ ఆదిత్యానాయుడు ఉన్నారు.

‘సర్పంచ్‌లకు అవగాహన అవసరం’

రణస్థలం: చెత్త నుంచి సంపద సృష్టించేందుకు సర్పంచ్‌లు, కార్యదర్శులకు అవగాహన అవసరమని ఎంపీడీవో ఆర్.వి.రమణమూర్తి అన్నారు. మండలంలోని జేఆర్‌పురం చెత్త సేకరణ కేంద్రాన్ని 31 గ్రామ పంచాయతీ సర్పంచులు, 28 మంది పంచాయతీ కార్యదర్శులు మూడు రోజుల రిఫ్రెషరీ శిక్షణలో భాగంగా శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి, చెత్త తరలింపు, చెత్త నుంచి సంపద తయారీపై అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, ఏవో ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.ఆర్.రజిని సూచించారు. వర్సిటీ మైదానంలో స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని క్రీడా పోటీలను శుక్రవారం ప్రారంభించారు. విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర అన్ని వర్గాలకు ఈ ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రెక్టార్ అడ్డయ్య, రిజిస్ట్రార్ సుజాత, అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం

- మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న కిరణ్‌కుమార్

రణస్థలం: రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని నడిపిస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ మండిపడ్డారు. మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విజయవాడ నడిబొడ్డున డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రతిష్టాత్మకంగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్మించడాన్ని ఓర్వలేక శిలా ఫలకాన్ని ధ్వంసం చేయడం దారుణమని మండిపడ్డారు. ఇది రాజ్యాంగ నిర్మాతకు జరిగిన అవమానంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. కూటమి నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడిచేసి భయభ్రాంతులకు గురి చేయడమే కాకుండా, ఏకంగా భారత రాజ్యాంగ నిర్మాత విగ్రహాలను సైతం వదలడంలేదని ధ్వజమెత్తారు. ఇటువంటి అరాచక కుటమి ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బవిరి రమణ, మీసాల రామారావు, జక్కంపూడి అచ్చిబాబు, మైలపల్లి పిల్లతాత, వైఎస్సార్‌సీపీ నాయకులు దన్నాన సీతారాం, మిండి జనార్దన్ రెడ్డి, ముద్దాడ రాజశేఖర్, కరిమజ్జి నాగభూషణ్, బలివాడ శ్రీను, టొంపల సూరప్పడు, నేతల పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తితో శ్రావణ పూజలు



సంతోషిమాత ఆలయం వద్ద క్యూలో ఉన్న భక్తులు



కోదండ రామాలయంల్లో భక్తజన సందోహం



బలగ అయ్యప్ప దేవాలయంలో మహాలక్ష్మిని దర్శించుకుంటున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా ఆలయాలు, ఇళ్లల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. పాత శ్రీకాకుళంలో సంతోషిమాత అమ్మవారి ఆలయంలో, పీఎన్ కాలనీలోని నారాయణ తిరుమల కొండపై వెలసిన శ్రీవేంటేశ్వరస్వామి ఆలయంలో మహాలక్ష్మి అమ్మవారికి అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. కోదండ రామాలయంలో మహాలక్ష్మికి, బలగ అయ్యప్పస్వామి ఆలయంలో మహాలక్ష్మికి విశేష పూజలు నిర్వహించారు. చిన్నబజారులోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. నక్కవీధిలోని ఉమాజఠలేశ్వర దేవాలయంలో ఉమాదేవికి సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. బాదుర్లపేట గౌరీ పరమేశ్వర స్వామి ఆలయంలో, డీసీసీబీ కాలనీలోని భూ సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయం, మొండేటివీధిలోని లలితా సమేత శివ కామేశ్వరస్వామి ఆలయంలో లలితా దేవికి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. గుజరాతీపేటలోని రాజరాజేశ్వరీ దేవి పీఠంలో నిర్వాహకులు పెంట రామచంద్ర శేఖరశర్మ నేతృత్వంలో పూజలు జరిగాయి.

విద్యాభివృద్ధికి వెంకట్ కృషి అభినందనీయం

- ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు



కంప్యూటర్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

రణస్థలం: విద్యాభివృద్ధికి రోటరీ క్లబ్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ పిసిని వెంకట సత్యనారాయణ చేస్తున్న సేవలు అభినందనీయమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. మండలంలోని కోష్ట గ్రామంలో రోటరీ క్లబ్ సైబరాబాద్, ఏటీ అండ్ టీ కమ్యూనికేషన్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో రణస్థలం మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు, స్వచ్ఛంద సంస్థలకు అవసరమైన కంప్యూటర్లను ఉచితంగా శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మనం ఎంత ఎదిగినా ఉన్న ఊరిని, కన్నతల్లిని ఎప్పటికీ మరిచిపోకూడదన్నారు. పేదరికం రూపుమాపే విద్యకు సాంకేతికత జోడించి అందించేందుకు చేస్తున్న ఈ ప్రయత్నం పూర్తిస్థాయిలో చక్కటి ఫలితాలు ఇవ్వాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ శ్రీకాకుళం అధ్యక్షుడు పిసిని హరికృష్ణ, కోష్ట మాజీ సర్పంచ్ పిసిని జగన్నాథ, ఎంపీటీసీ అసిరినాయుడు, మాజీ ఎంపీటీసీ అప్పడుదొర తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

భక్తిశ్రద్ధలతో నాగమిథునం పూజలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నక్కవీధి ఉమాజఠలేశ్వరస్వామి దేవాలయంలో ఉన్న నాగ మిథునం (జంట సర్పాలు)కు నాగపంచమి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు అశ్వనీకుమార్, మహేష్‌ల ఆధ్వర్యంలో నాగ మిథునానికి వెండి తొడుగు అలంకరణ చేశారు. భక్తులు దర్శించుకొని పూజలు చేశారు.

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే చెప్పండి

శ్రీకాకుళం క్రైమ్: ఆకతాయిలెవరైనా ఈవిటీజింగ్, ర్యాగింగ్ వంటివి చేస్తే కచ్చితంగా పోలీసులకు సమాచారం అందించాలని ట్రాఫిక్ ఎస్ఐ సోమశేఖరం అన్నారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు నగరంలోని నారాయణ, శ్రీచైతన్య విద్యాసంస్థల్లో విద్యార్థినీ విద్యార్థులకు గుడ్ టచ్– బ్యాడ్ టచ్, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మాదకద్రవ్యాలు వినియోగిస్తే కలిగే అనర్థాలు, మైనర్ డ్రైవింగ్ వలన జరుగు ప్రమాదాలపై వివరించారు.

‘మద్దతు ధరల గ్యారంటీ చట్టం తీసుకురావాలి’

జి.సిగడాం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంట మద్దతు ధరల గ్యారంటీ చట్టం తీసుకు రావాలని సీఐటీయూ సీనియర్ నాయకుడు వెలమల రమణ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సేవ్ ఇండియా కార్యక్రమంపై శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు పూర్తిస్థాయిలో చట్టం తీసుకొచ్చినప్పుడే రైతుల అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో కెల్ల సీతంనాయుడు, శిరుగుడి మన్మథరావు, అప్పలరాజు, శ్రీనివాసరావు సూర్యనారాయణ, చిన్నఅప్పయ్య, అప్పలనాయుడు, అసినాయుడు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఆదివారం ఉచిత భోజనం

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలేం ఫ్లై ఓవర్ కింద ప్రతీ ఆదివారం ఉచిత భోజనం పంపిణీ చేయనున్నట్లు మహాత్మా జ్యోతిరావుపూలే, సావిత్రిబాయిపూలే ట్రస్ట్ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని ఆగస్టు 15వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. పేదలకు భోజనం అందించడమే లక్ష్యంగా అమలు చేయనున్నట్లు వివరించారు.

జీవామృతంతో భూసారం

ఎచ్చెర్ల క్యాంపస్: జీవామృతంతో భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ఎచ్చెర్ల యూనిట్ ఇన్‌చార్జి సువ్వారి సన్యాసిరావు అన్నారు. జరజాం పంచాయతీ గొలివివానిపేట గ్రామంలో జీవామృతం తయారీపై రైతులకు శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీరైతు జీవామృతం సొంతంగా తయారు చేసుకొని వినియోగించాలన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యతనివ్వడం వలన ఖర్చులు తగ్గుతాయని, పంటల దిగుబడులు పెరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ శిక్షకుడు మెట్ట ధనుంజయ, గొలివి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భోజనం అందజేత

గార: రామచంద్రాపురం పంచాయతీ జొన్నలపాడు కాలనీ ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు తిథి భోజన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం భోజనం అందజేశారు. పందిరి సత్యన్నారాయణ సమకూర్చగా, పాఠశాలలోని విద్యార్థులతో పాటు అంగన్‌వాడీ చిన్నారులు భోజనాలు చేశారు. హెచ్‌ఎం పి.విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

ముమ్మరంగా లంపీస్కిన్ వ్యాక్సినేషన్

ఎచ్చెర్ల: మండలంలోని పశువులకు లంపీస్కిన్ నివారణ టీకాలు ముమ్మరంగా వేస్తున్నారు. ఈ వ్యాధి సోకకుండా ముందుగానే టీకాలను వేయడం జరుగుతోందని పశువైద్యులు తెలుపుతున్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి రమణ తెలిపారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు

జి.సిగడాం: వ్యవసాయంలో ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని రణస్థలం ఏడీఏ వడ్డాది శ్రీనివాసరావు, మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని వెంకయ్యపేట గ్రామంలో పొలంబడి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ పంట వేసుకునే ముందు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు తీసుకోవడం ఉత్తమమన్నారు. వరి సాగులో కాలిబాటలు వేసుకుంటే వరి దుబ్బు ఎదుగుదలతోపాటు పంట దిగుబడులు సాధించగలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కాయల రమణ, సర్పంచ్ మామిడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.